# ప్రజ్ఞోత్సవం



కోటమర్తి రాధాహిమబిందు

"అదిగో ఏదో కారు వస్తోంది ఆపండి" నా భార్య నన్ను తట్టేసరికి ఉలిక్కిపడి లేచి నిలబడ్డాను. పాదాలలో బలహీనత వున్నా అవసరం అలాంటిది గాబట్టి నాపాదాలు మొరాయించకుండా రోడ్డుమీదికి బాగానే పరుగులు తీశాయి.

"ఆపండి... ఆపండి" అంటూ చేయి చాచి వేళ్లను కదిలించాను. దగ్గరగా వచ్చి కారు ఆగింది.

"వ్వాట్" చిరాకు గొంతు.

"సర్... కిష్టాపురం వెళ్లాలి కాస్త లిఫ్ట్ యిస్తారేమో అని... యిక్కడ కూర్చుని రెండు గంటలవుతుంది... యిక్కడినుండి మూడు గంటలకోసారి బస్ వుందట... యింకో గంట గడిస్తేగాని బస్‌రాదు"

'ఏంటి ఈ సోది' అన్నట్లు ప్రక్కతన్ని చూశాడు అతను.

"సర్... ప్లీజ్..."

"నో.... కుదరదు" సర్రున వెళ్లిపోయిందాకారు.

నా భార్య ముఖంలో నిరాశ నన్నెంతో బాధ పెట్టింది. నాతోపాటు తననీ అవస్థ పెడుతున్నాను. 'ఛీ' అనిపించింది నాపై నాకే...

"అదిగో యింకో కారు వస్తోందండీ"

ఎలాంటి పరుగులు తీయకుండానే చేతులు అటూ యిటూ ఆడించాను ఆపమని, కారు ఆగింది.

"సర్ కిష్టాపురం వెళ్లాలి.... కాస్త లిఫ్ట్ యివ్వగలరా... నా భార్యకు మోకాళ్ల నొప్పులు" నా మాటలు సరిగ్గా పూర్తిగానేలేదు.

"ఏయ్ పోవయ్యా వెధవ న్యూసెన్స్"- చర్రున వెళ్లిపోయిందాకారు.

అలా మరో రెండు కార్లను ఆపినా ఫలితం లేకుండా అయింది. యింకోరెండు కార్లు ఈడ్చి ముఖం మీద కొట్టినట్లుగా నా అభ్యర్థన వినకుండానే స్పీడ్‌గా వెళ్లిపోయాయి.

"ఏమండీకారు"

ఆపమని నాసైగ... ఆగింది కారు.

"సర్... కిష్టాపురం వెళ్లాలి"

నన్ను నా భార్యను ఎగాదిగా చూసి ముఖం తిప్పుకున్నాడు ఫుల్‌సూట్‌లో వున్న అతను. ప్రక్కనున్నావిడ ముక్కు చిట్లిస్తూ "పోనీడ్రైవర్" అంది.

"అమ్మా కాస్త దయ తలిస్తే...."

"ఎక్కడ కూర్చుంటారు?" గుయ్‌మంది ఆవిడ....

ఆ మాత్రానికే పొంగిపోయింది నా మనసు...

"ముందు కూర్చుంటాం తల్లీ... యిద్దరం దబ్బనాల్లా వున్నాం"

"వాళ్లతో ఏంటీ నీ మాటలు పోనీ డ్రైవర్" అతని గొంతు గుర్రుమంది.

"సర్... సర్..."

వెళ్లిపోయింది కారు.

"యింక ఎవర్నీ అడగొద్దు... పదండి అలా వెళ్లి కూర్చుందాం... బస్ వచ్చింతర్వాతే వెళ్దాం..." నా భార్య దృఢంగా అంటూ మరోవైపుకి నడిచే సరికి నేనూ ఆమెను అనుసరించాను.

నా ప్రియశిష్యుడు శ్యామ్ సుందర్ నన్నూ నా భార్యను తనపెళ్లికి రమ్మని ఆహ్వానించింది గుర్తొస్తుంటే అలసటగా నా భార్య ప్రక్కన కూలబడి పోయాను.

* * *

"మాస్టారూ... ప్లీజ్ అలా అనకండి... మీరు తప్పకరావాలి" పావుగంటనుండి నన్ను అలా బ్రతిమాలుతూనే వున్నాడు శ్యామ్ సుందర్. శ్యామ్ నా అభిమాన శిష్యుడు... చిన్నప్పుడు చదువులో చచ్చేంత మొద్దుగా వుండేవాడు. వాడ్ని తీర్చిదిద్దింది నేనే... నా మాటల ప్రభావం వాడిపై ఎంతో వుండేది. నేను తెలుగు మాస్టార్ని...

చిన్నతనంలో నా చుట్టూ తిరిగే నా శిష్యులు చాలామంది నాకు బాగా గుర్తే.. పెద్ద ఉద్యోగాల్లో, జీవితాల్లో స్థిరపడిపోయిన వారు కొందరైతే... వ్యసనపరులు, బద్ధకస్తులు మరికొందరు... కొంత మంది నమస్కరించేవారు, కొంతమంది ఎక్కడ నమస్కారం చేయాల్సివస్తుందో అని తప్పించుకుని వెళ్లేవారు. యిలా నా స్టూడెంట్స్ అడపా దడపా కన్పిస్తూనే వుండేవారు.

శ్యామ్‌సుందర్ నేను ఊహించని ఎత్తుకు ఎదిగిపోయాడు. బాగా చదువుకున్నాడు. అమెరికా వెళ్లి ఆరేళ్లు వుండి ఈ మధ్యనే ఇండియా వచ్చాడు. పెద్ద యిండస్ట్రీ పెట్టాడు. యిప్పుడు పెళ్లి కుదిరింది రమ్మని ఆహ్వానం...

"కాఫీ తీసుకో బాబూ"

"పంతులమ్మగారూ... మీరు రానని చెప్పటం ఎంతో బాధగా వుంది"

"రాననిగాదు శ్యామ్... రాలేనని... నాకు మోకాళ్ల నొప్పులు, మీ మాస్టారుకి షుగరు. ఏవో

చిన్నతనంలో నా చుట్టూ తిరిగే నా శిష్యులు చాలామంది నాకు బాగా గుర్తే.. పెద్ద ఉద్యోగాల్లో, జీవితాల్లో స్థిరపడిపోయిన వారు కొందరైతే... వ్యసనపరులు, బద్ధకస్తులు మరికొందరు... కొంత మంది నమస్కరించేవారు, కొంతమంది ఎక్కడ నమస్కారం చేయాల్సివస్తుందో అని తప్పించుకుని వెళ్లేవారు. యిలా నా స్టూడెంట్స్ అడపా దడపా కన్పిస్తూనే వుండేవారు.

మాయదారి రోగాలు... ఏం రాగలం అంతదూరం? రెండు బస్‌లు మారి మూడో బస్ ఎక్కాలి... అదీగాక అక్కడ మూడు గంటలకోసారి బస్ వుంటుం దంటున్నావ్...."

"బస్ ఎందుకమ్మా మిమ్మల్ని కార్లో తీసి కెళ్తాను... మీరు ఊఁ... అనండి చాలు..."

"వద్దులే శ్యామ్... మాపై నీకు అంత అభిమానం వుంది అదిచాలు... పెళ్లికొడుకువి... నీకెన్నో పనులు వుండి వుంటాయి. మాకేం... నువ్వేం అవస్థపడకు... మమ్మల్ని గుర్తుపెట్టుకుని యిలా వచ్చి పెళ్లికి పిలవటం ఎంతో ఆనందంగా వుంది." అన్నాను నేను.

"అందుకే రమ్మనగానే వస్తున్నారు"

"నువ్విలా మాట్లాడుతుంటే చిన్నప్పటి శ్యామ్ గుర్తొస్తున్నాడు కదూ ధరణీ..."

"అవును" నవ్వింది ధరణి

"రావాలని వున్నా రాలేని అసహాయత అర్థంచేసుకో శ్యామ్. పెళ్లి చేసుకుని నీ భార్యను తెచ్చి చూపించు ఎంతో సంతోషిస్తాం."

"అదెలాగూ చేస్తాను మాస్టారూ... మీ యిద్దరూ రావాలని గదా నా కోరిక..."

"మా ఆశీస్సులు నీకుంటాయి మమ్మల్ని యిబ్బంది పెట్టకు శ్యామ్..."

"మీ యిష్టం మాస్టారూ..." భారంగా అన్నాడు శ్యామ్‌సుందర్.

* * *

"ఏమండీ సైకిల్‌మీద ఎవరో అటు వెళ్తున్నారు కిష్టాపురమేమో అడగండి"

"బస్ వచ్చే టైమయిందిగా..."

"ఏమో ఈ బస్‌లని ఏం నమ్మగలం... కిష్టాపురం అయితే శ్యామ్‌మోహన్‌కి పరిస్థితి చెప్పమందాం..."

"ఏయ్ బాబూ నిన్నే... ఏయ్ నిన్నే..." చప్పట్లు కొట్టి పిలిచేసరికి ఆగి వెనక్కు తిరిగి వచ్చాడు అతను.

"ఎక్కడికి వెళ్తున్నావు బాబూ"

"కిష్టాపురం"

"బాబ్బాబూ... ఓ సహాయం చేస్తావా? శ్యామ్ సుందర్ అని వున్నాడు చూడు. అదే అమెరికానుండి వచ్చాడు"

"తెల్సు... మా దొరవారే.... యివాళోపెళ్లి"

"నేనో కాగితం యిస్తాను అతనికిస్తావా?"

"ఆ"

చిన్న లెటర్ వ్రాసి అతనికిచ్చాను. రివ్వున వెళ్లి పోయాడతను. మరో పదినిమిషాల్లో దూరంగా బస్‌వస్తూ కన్పించింది.

"ధరణీ... బస్..."

బస్ ఆగింది... పాపం కండక్టర్ చాలా మంచివాడే. ఓపిగ్గా నిలబడ్డాడు మేం బస్ ఎక్కే దాకా... మాకు సీట్లు దొరికాయి. మా యిద్దరి ప్రాణాలు కుదుటపడ్డాయి. కిష్టాపురానికి రెండు టిక్కెట్లు తీసుకున్నాను.

"ఏం సారూ... మీరు గూడా పెళ్లికేనా?" అడిగాడు కండక్టర్.

"ఆఁ... అవును"

"యిదే చివరి ట్రిప్పా... యింకో రౌండు వుందా?" అడిగారెవరో...

"లేదు లేదు యిదే లాస్ట్ ట్రిప్... ఈ రాతికి కిష్టాపురంలోనే పడుకుంటుంది బస్"

"అంత గొప్పమనిషికి ఈ పల్లెటూర్లో పెళ్లేమిటో" అన్నారెవరో.

"తాతగారు నానమ్మ కోసం ఈ పల్లెటూర్లో పెళ్లి చేసుకుంటున్నాడు శ్యామ్‌బాబు. పిల్లవాళ్లను యిక్కడికే రప్పించారు. పెళ్లిగాబట్టే బస్ అంతా నిండుగా యిలా కళకళలాడిపోతుంది." అంటున్నారెవరో

"ఊరంతటికీ భోజనాలు అక్కడేనటగదా" మరొకరు. బస్‌లో జనాలు శ్యామ్ గురించి వాళ్ల వాళ్ల గొప్పతనాల గురించి చర్చించుకుంటుంటే నా మనసులో పెళ్లికి రావాలనుకున్న మా చర్చ మెదిలింది.

* * *

"ధరణీ పాపం... శ్యామ్ సుందర్ అంతగా పిలిచాడు పెళ్లికి వెళ్దామా?"

"వెళ్తేనే బాగన్పిస్తోంది... శ్యామ్ అంటే మనిద్దరికీ ఎంతో యిష్టం పైగా యింతగా గుర్తుపెట్టుకుని వచ్చాడు."

"నాకూ బాగా వెళ్లాలన్పిస్తోంది"

"వెళ్దాద్దామా"

''నువ్వు సరే అంటే సరే....''

''వెళ్లగలమా? కొత్త ప్రదేశం అందులో బస్‌లు మారి వెళ్లాలి.''

''శుభలేఖ వుంది గదా.''

''ఫోన్ చేయండి మరి వస్తున్నట్లు.''

''వద్దులే... చెప్పకుండానే వెళ్దాం... సస్పెన్స్‌గా థ్రిల్లింగ్‌గా వుంటుంది.''

* * *

బస్ ఆగింది కుదుపుతో...

''టైర్ పంచరైందో ఏమో'' భయపడింది ధరణి.

నా గుండె ఆగినంత పనైంది ఒక్కక్షణం... మరుక్షణం నా కళ్లను నేనే నమ్మలేకపోయాను.

''నమస్కారం మాస్టారూ... నమస్తే అమ్మా... రండి... దిగండి...''

మా లగేజీ అందుకున్నాడు శ్యామ్‌సుందర్. అతని వెంట యిద్దరం దిగాం. అతని వెంట కారు దగ్గరకి నడిచాం. మూడు కార్లనుండి దిగిన కొందరు శ్యామ్ దగ్గరకి వచ్చారు.

''నేను నడిచివస్తాను మీరు వెళ్లండి'' అన్నాడు వారితో.

''భలేవారే- మీరు నడిచి వస్తుంటే మేం కారెక్కుతామా?'' అంటూ వాళ్లు మమ్మల్ని చూశారు.

''నాకు దైవసమానులు ఈ యిద్దరూ'' అంటూ వాళ్లని పరిచయం చేసి ''అమ్మా కారెక్కండి... మాస్టారూ ఎక్కండి'' అన్నాడు.

యిద్దరం కారెక్కాం. సన్నాయి మ్రోగింది. కారులో మేం. కారు ప్రక్కన నడుస్తూ శ్యామ్ సుందర్....

''శ్యామ్... ఏంటిది... లోపలికిరా''

''ఫర్వాలేదు మాస్టారూ''

కనీసం ఓ అరకిలో మీటరు వుంటుంది శ్యామ్ నడిచిందంతా... ఈ అరకిలో మీటరు కారు ముందు సన్నాయి... మధ్య మధ్య బ్యాండు... కారులో మేం- శ్యామ్‌తో... శ్యామ్ వెనక నడుస్తూ మాకు కార్లలో కన్పించినకొందరు...

పెళ్లింటికి వచ్చాం... శ్యామ్ సుందర్ తల్లి తండ్రి ఎంతో ఆదరంగా గౌరవప్రదంగా ఆహ్వానించారు మా యిద్దర్ని... శ్యామ్ తాతగారు నానమ్మ ఎంతో ఆప్యాయత చూపించారు...

శ్యామ్ మా యిద్దర్ని ప్రక్కప్రక్కన నిలుచోబెట్టి పాదాలు కడిగి ఆ నీళ్లు తలపై చల్లుకున్నాడు. నా మనసు ద్రవించి పోయింది. శ్యామ్‌సుందర్‌ని ఒక్కసారిగా లేవనెత్తి హృదయానికి హత్తుకున్నాను. నా గొంతు పెగల్లేదు తృప్తితో కూడిన ఆనందంతో...

నా పాదాలకు ధరణి పాదాలకు నమస్కరించిం తర్వాతే అతని ముఖంలో టెన్షన్ తగ్గింది.

***

''సారీ మాస్టారూ'' అన్నాడు సూట్‌వాలా.

''ఫర్వాలేదు... మీ కారు మీ యిష్టం... మీరేం గిల్టీగా ఫీలవకండి.

''క్షమించండి అన్నయ్యగారూ'' 'ఎక్కడ కూర్చుంటారు' అని గఁయ్‌మన్న ఆవిడ.

చిరునవ్వుతో చూశాను ఆవిడ్ని... ''దయచేసి శ్యామ్‌సుందర్‌గారితో ఏం చెప్పకండి... మా కూతుర్ని వారి తమ్ముడికి యివ్వాలని ఆశపడుతున్నాం'' అన్నాడొకతను.

''ఎక్స్‌క్యూజ్‌మీ'' చేతులు పట్టుకున్నాడు మరొకతను.

''శ్యాంసుందర్ మీ గురించి చెప్పాడు'' అన్నాడో పెద్దమనిషి...

''ఓ అందుకా.. మీరిలా రియాక్ట్ అవుతున్నారు.''

''అదిగాదు సర్...''

''చూడండి... నేను శ్యామ్‌కి చదువు చెప్పానంతే... అదే ఎంతో భాగ్యంగా భావించి నాకీ స్థానం కల్పించి ఎంతో సంస్కారవంతుడిగా తనని తాను నిరూపించుకున్నాడు''

''సారీ సర్... ఎవరో మామూలు వాళ్లు లిఫ్ట్ అడుగుతున్నారనుకున్నాను.''

''మీ స్థాయి వున్న వాళ్లకు లేదా మీ కన్నా పై స్థాయి వాళ్లకే మీరు లిఫ్ట్ యిస్తారా?'' నవ్వాను నేను.

''వెరీ సారీ మాస్టారూ.... మీరింత గొప్పవారనుకో లేదు''

చిరునవ్వుతో చూశాను అందర్నీ...

''మీకు చదువు చెప్పిన టీచర్లు ఎంతో నేనూ అంతే... యిందులో నాకేదో ప్రత్యేకం యింకేదో గొప్పతనం ఏమీ లేదు.''

''మేం చాలా పొరపాటు చేశాం మాస్టారూ''

''యిందులో మీ తప్పేం లేదు. సగటు మనిషి ఎట్లా ప్రవర్తిస్తాడో మీరూ అట్లాగే ప్రవర్తించారు. నావేషాన్ని బట్టి మీ కారు సీట్లు మాసిపోతాయేమో, వాటికేసిన కవర్లు నలిగిపోతాయేమో అని బెంగపడ్డారు. అయిష్టత చూపించారు. కారు కొనుక్కునే స్థోమతకలవాడికే కారు ఎక్కేస్థాయి వుంటుందని మీరనుకున్నారు. అలా మీరనుకోవటం ఓ రకంగా మంచిదయింది. శ్యామ్ ఔన్నత్యం ఏంటో యింకా బాగా అర్థం అయింది. గొప్పతనం, డాబూ, దర్పం డబ్బులో చూపించకండి. సహాయం, ప్రేమ, మానవత్వంలో చూపించండి. భగవంతుడు మనకు జ్ఞానాన్ని యిచ్చాడు. మనిషిగా అన్పించుకునేవాడు ఆ విషయాన్ని మర్చిపోకుంటే చాలు.''

పెళ్లయింతర్వాత తీరిక సమయంలో నాకూ వారికి జరిగిన చర్చ యిది ఎంతో క్లుప్తంగా...

* * *

పొందూరు ఖద్దరు బట్టల్లో వెలిగిపోతున్న నేను, ఖరీదైన పట్టుచీరెలో మెరిసిపోతున్న ధరణి బయటకువచ్చాం.

''మా కారులో రండి అంటే మా కారులో రండి'' అని పోటీ పడ్డారంతా...

''ఆహఁ... అవసరం లేదు. మేం మాస్టారు గారి వాళ్లతో వెళ్తున్నాం. పసుపు బట్టలతో ముందు మాస్టారి గారింటికి వెళ్లాలని నా కోరిక' అంటున్న శ్యాంసుందర్‌ని విస్తుపోయి చూశాను నేను. ధరణి ముఖంలో ఎంతో ఆనందం.

''శ్యామ్''

''మీరు పంతులమ్మగారు నాకు దైవ సమానులు. నేనీ రోజు ఈ స్థానంలో నిలబడటానికి ఏకైక కారకులు మీరే.... మాకు పిల్లలు లేకుంటేంరా నువ్వే మా కొడుకువి అనేవారు యిదివరలో ... యిప్పుడు ఈ కొడుకు కోడల్ని తీసుకుని మీ వెంటవస్తున్నాడు''

''నాయనా... శ్యామ్'' నా కళ్లు చెమర్చాయి. అక్కడ అంతా బొమ్మల్లా నిల్చుండిపోయారు.

* * *

వారం రోజులు శ్యామ్‌సుందర్ హనీమూన్ నా యింట్లోనే గడిచింది. ఆ అమ్మాయి కూడా శ్యామ్‌కి అన్ని విధాల అనుకూలమైన జీవిత భాగస్వామిగా మా యిద్దరి దృష్టిలో మనసుల్లో నిలిచిపోయింది. ఆ రోజే తిరుగు ప్రయాణం వారిది.

నా భుజాల చుట్టూ చేయివేసి నన్ను తనలో పొదువుకుంటూ నన్ను కారుదగ్గరికి నడిపిస్తుంటే నా ప్రక్కనే ధరణి నడిచింది.

''మాస్టారూ... ఓ ఫోన్‌కాల్ అంతదూరంలోనే నేనుంటాను.... మీకేది అవసరం అయినా నేనున్నానని మర్చిపోకండి'' అంటూ శ్యామ్‌సుందర్ తియ్యటి మాటలు నా హృదయంలో నిలిచిపోయాయి శాశ్వతంగా...



## అర్జున్ రాం 'ఫాల్'

ఇవాళటి తరం తారలు చాలా ఫాస్ట్. వీళ్లకు డబ్బు ఒక్కటే లెక్క. మిగతా ఏవీ కూడా పరిగణనలోకి రావు. అర్జున్ రాంపాల్ యువతరం హీరో. అతనికి ఇంకా అంతగా స్టార్‌డం రాలేదు. కానీ తను అలా అనుకోవడం లేదు. సూపర్‌స్టార్‌నయి చాలా కాలం అయిందనుకుంటున్నాడు. సునిల్ దర్శన్ వంటి బడా డైరక్టర్లుకూడా అతని కంటికి ఆనడం లేదు. డబ్బు ఒక్కటే తన భాషగా మాటాడుతున్నాడు. సునిల్ తన కొత్త సినిమాలో అర్జున్‌ని హీరోగా తీసుకోవాలనుకున్నాడు. కానీ అతను ఏకంగా కోటి రూపాయల పారితోషికం అడిగాడట. నిలువు గుడ్లేసిన సునీల్ ఇంకా తేరుకోలేదు. చేతులారా కెరీర్ పాడుచేసుకోవడమంటే మరి ఇదే...